Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue): 334 పేజీలు (Pages): 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 15 - 5 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## చైనాకు భారత్ షాక్.. ఇది మామూలు దెబ్బ కాదు




**న్యూఢిల్లీ :** చైనాకు గట్టిగా బుద్ధి చెప్పింది భారత్. ఆపరేషన్ సిందూర్ మీద తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్న డ్రాగన్ కంట్రీకి సంబంధించిన న్యూస్ ఏజెన్సీలను ట్విట్టర్‌లో బ్లాక్ చేసింది. చైనాలోని అధికార కమ్యూనిస్ట్ పార్టీకి చెందిన గ్లోబల్ టైమ్స్ అనే ఆంగ్ల పత్రికతో పాటు ఆ దేశ అధికార న్యూస్ ఏజెన్సీ జిన్ హువా ఎక్స్ అకౌంట్లను బ్లాక్ చేసింది మోదీ సర్కారు. ఆపరేషన్ సిందూర్ విషయంలో ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించడం, ధృవీకరించకుండానే సమాచారాన్ని వ్యాప్తి చేయడం విషయంలో చైనాపై ఇప్పటికే అక్కడి భారత ఎంబసీ మండిపడింది. ఆపరేషన్ సిందూర్ మీద కొన్ని పాకిస్థాన్ అనుకూల వర్గాలు నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తున్నాయని పేర్కొంది. అలాంటి సమాచారాన్ని వెరిఫై చేయకుండా వ్యాప్తి చేయడం సరికాదని, ఇది బాధ్యతాయుతమైన పాత్రికేయం అనిపించుకోదంటూ చైనీస్ మీడియాను దుయ్యబట్టింది.

**భారత ఎంబసీ కోరినా..**

ఆపరేషన్ సిందూర్‌పై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయొద్దంటూ చైనాలోని భారత ఎంబసీ కోరినా ఏ మార్పు రాలేదు. డ్రాగన్ కంట్రీకి చెందిన న్యూస్ ఏజెన్సీలు ఫేక్ న్యూస్‌ను ప్రచారం చేయడంతో మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. చైనాకు చెందిన గ్లోబల్ టైమ్స్‌తో పాటు జిన్‌హువా న్యూస్ ఏజెన్సీని ట్విట్టర్‌లో బ్లాక్ చేసేసింది.

## టెక్నాలజీని అందరూ ఫాలో కావాల్సిందే.. సీఎం చంద్రబాబు




**విజయవాడ, (రాజధాని వార్తలు):** టెక్నాలజీని అందరూ ఫాలో కావాల్సిందేనని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. విజయవాడలో జరుగుతున్న పశుసంవర్ధక శాఖ టెక్ ఏఐ 2.0ను ఇవాళ సీఎం చంద్రబాబు ప్రారంభించి ప్రసంగించారు. గతంలో ఎంట్రప్రెన్యూర్‌లను ప్రోత్సహించుకోవడానికి జి ఎఫ్ ఎస్ టిలాంటి సంస్థను తెచ్చామని గుర్తు చేశారు. లైవ్ స్టాక్‌పై 42 లక్షలు మంది ఆధారపడ్డారని చెప్పిన చంద్రబాబు, 13.5 శాతం జీఎస్‌టి కాంట్రిబ్యూషన్ లైవ్ స్టాక్ ద్వారా వస్తోందని వివరించారు. "నేను నిత్య విద్యార్థిని. అనునిత్యం కొత్త విషయాలు నేర్చుకుంటూనే ఉంటాను." అని సీఎం చంద్రబాబు అన్నారు. రైతులకు ఉపయోగపడేలా అప్లికేషన్స్ తయారు చేస్తున్న స్టార్టప్‌లను ప్రోత్సహిస్తూ, అప్పటికప్పుడు నిర్ణయం తీసుకున్న సీఎం.. రైతులకు ఉపయోగపడేలా వాట్సాప్‌లోనే అన్ని సేవలు అందించేలా అప్లికేషన్ తయారు చేయాలని సూచించారు. ఏపీలో 1000 కిలోమీటర్లకు పైగా ఉన్న సముద్ర తీరాన్ని పూర్తి స్థాయిలో ఉపయోగించుకొని మారిటైం ప్రాజెక్టులు నెలకొల్పుతామని సీఎం చంద్రబాబు తెలిపారు. దుగరాజపట్నంలో నౌకా నిర్మాణం, మరమ్మతుల క్లస్టర్, గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్‌తో కలిపి అభివృద్ధి చేసేందుకు విభజన హామీలో భాగంగా కేంద్రం అంగీకరించిందని, అందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మిల్క్ డైరీల నుండి ఫార్మర్స్‌కు రెగ్యులర్‌గా ఆదాయం వస్తోందని, తెలుగుదేశం అధికారంలో ఉన్న ప్రతిసారీ రైతు ఆదాయం డబుల్ అవుతుందని చంద్రబాబు చెప్పారు. డైరీ పరిశ్రమలో కూడా పురోగతి వుంటోందని, లక్ష 69 వేల కోట్లు లైవ్ స్టాక్‌లో జీఎస్‌డిపి కాంట్రిబ్యూషన్ ఉందని తెలిపారు. "దీని తరువాత హార్టీకల్చర్లో అత్యధిక ఆదాయం వస్తోంది. దేశంలో వ్యవసాయ రంగంలో ఫాస్ట్ గ్రోయింగ్ ఏపీనే. ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణగా ఎప్పటి నుండో చెపుతారు. తెలంగాణకు 67 శాతం సర్వీస్ సెక్టార్, వ్యవసాయం 14 శాతం ఉంది. ఏపీలో అగ్రికల్చర్ ఎక్కువ.. సర్వీస్ సెక్టార్ తక్కువ. సర్వీస్ సెక్టార్ ఆదాయం రాష్ట్రంలో తగ్గిపోయింది. రాష్ట్రంలో ఫుడ్ హ్యాబిట్స్ మారిపోతున్నాయి. నేను ఉదయం బ్రేక్ఫాస్ట్‌గా అమ్లెట్ మాత్రమే తింటాను. మిల్లెట్‌లు, ఫ్రూట్‌లకు ప్రాధాన్యం పెరుగుతుంది. దేశంలో మైక్రో ఇరిగేషన్ ఎక్కువగా ఉన్న రాష్ట్రం ఏపీ" అని చంద్రబాబు చెప్పారు. ఇంకా తన ప్రసంగంలో సీఎం చంద్రబాబు ఏం చెప్పారంటే.." ప్రస్తుతం పెరిగిన టెక్నాలజీతో మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. వచ్చే 3 నుండి 4 నెలల్లో 100 శాతం వాట్సప్ గవర్నెన్స్ కల్పిస్తాం. రాబోయే రోజుల్లో జీఎఫ్ఎస్‌టిలాంటి సంస్థలు మరిన్ని ఏర్పాటు చేయాలి. వ్యవసాయ కూలీలు, రైతు కుటుంబంలో పిల్లలు ఐటి చేయాలని గతంలో పిలుపు నిచ్చాం. ఇప్పుడు కొత్త నినాదంతో ముందుకు వస్తున్నాం..అదే.. ప్రతి ఇంటికి.. ఒక సంస్థకు యజమాని (ఎంటర్‌పెన్యువర్) తయారు కావాలి. గోదార్‌కు పైలెట్ ప్రాజెక్ట్‌గా చిత్తూరు జిల్లా. ఐటి కంపెనీల్లో సాఫ్ట్ వేర్ ఎంప్లాయ్‌గా పని చేసే వాళ్లు ఇప్పుడు వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు. డైరీ షెడ్స్‌కు పల్లెలో అయినా పట్టణాల్లో అయినా ప్రాపర్టీ టాక్స్ రద్దు." వంటి సంచలన విషయాల్ని చంద్రబాబు తన ప్రసంగంలో వెల్లడించారు.

## ఏపీలో మెట్రో రైల్ ప్రాజెక్ట్‌లో కీలక ముందడుగు



**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణాలు ఊపందుకుంటున్న సంగతి తెలిసిందే. ఆ నగరం పూర్తి అయితే కచ్చితంగా దాని ప్రభావం ఏపీలోని రెండు కీలక నగరాలైన విజయవాడ, విశాఖలోపై పడనుంది. ట్రాఫిక్ రద్దీ మరింత పెరిగిపోనుంది. అందుకే ముందు జాగ్రత్తగా ఆ రెండు జిల్లాలో మెట్రో ప్రతిపాదన తీసుకొచ్చింది కూటమి ప్రభుత్వం. ఇప్పటికే దీనికి కేంద్ర ప్రభుత్వం కూడా ఓకే చెప్పింది. ఇందులో భాగంగానే మెట్రో నడిచే ప్రాంతాల్లో భూసేకరణకు చర్యలు తీసుకుంది. అంతేకాకుండా, ఈ రెండు ప్రాజెక్టుల డీపీఆర్ లు సిద్ధం చేయడంతో పాటు టెండర్ల ప్రక్రియ కూడా రెడీ అయింది. ఈ నేపథ్యంలోనే మెట్రో రైల్ ప్రాజెక్ట్‌లో కీలక ముందడుగుపడింది. AIIB బ్యాంకు ప్రతినిధులతో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ రామకృష్టారెడ్డి సమావేశం అయ్యారు. తక్కువ వడ్డీకి రుణం ఇచ్చే బ్యాంకులతో సంప్రదింపులు జరిపారు. రుణాలు ఇచ్చేందుకు పలు విదేశీ బ్యాంకులు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. KFW, AFD, ADB, NDB, AIIB, జైకా, ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు విశాఖ మెట్రోకు రూ.6,100 కోట్లు రుణం సమీకరించాలని, అలాగే విజయవాడ మెట్రోకు రూ.5,900 కోట్లు రుణం సమీకరించాలని నిర్ణయించారు.

## మే 15 నుంచి వీఐపీ బ్రేక్ దర్శనాలు




**తిరుమల, (రాజధాని వార్తలు):** టీటీడీ భక్తులకు శుభవార్త. తిరుమలలో గురువారం (15వ తేదీ) నుంచి వీఐపీ సిఫార్సు లేఖలపై బ్రేక్ దర్శనాలు పునఃప్రారంభమవుతాయని, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సిఫార్సు లేఖలను పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని ఏపీ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. కాగా తిరుమలలో భక్తుల రద్దీ తగ్గడంతో టీటీడీ మళ్లీ సిఫార్సు లేఖలను స్వీకరించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ నిర్ణయంతో మరికొందరు భక్తులకు ఊరట దక్కనుంది. వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని సామాన్య భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు నెల రోజులుగా వీఐపీ సిఫారసు లేఖలను రద్దు చేశారు. వీఐపీ బ్రేక్ దర్శనంలో సిఫారసు లేఖలు ఆమోదిస్తుంటారు. గత కొద్ది రోజులుగా ఆగిపోయిన ప్రత్యేక దర్శనాలను మళ్లీ ప్రారంభించేందుకు నిర్ణయించినట్లు ఈ మేరకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. ప్రతి వేసవిలో తిరుమలలో భారీగా రద్దీ ఉంటుంది. అందరికీ సెలవులు కావడంతో భక్తులు పెద్దఎత్తున పోటెత్తుతుంటారు. ఈ క్రమంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు, త్వరగా దర్శనం కల్పించేందుకు టీటీడీ తగిన ఏర్పాట్లు చేస్తుంటుంది. ఇందులో భాగంగా మే 1వ తేదీ నుంచి వీఐపీ బ్రేక్ దర్శన వేళల్ని మార్చింది. ఉదయం వేళ ఉండే ప్రోటోకాల్ దర్శనం, రిఫరల్ ప్రోటోకాల్, జనరల్ బ్రేక్ దర్శనాలను ఉదయం 7.30 గంటల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. తద్వారా సామాన్య భక్తులకు మరింత సమయం కేటాయించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఆ తరువాత జూలై 15 వరకూ సిఫార్సు లేఖల్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. వేసవి రద్దీ ముగిసిన తరువాతే సిఫారసు లేఖల్ని పునరుద్ధరించనున్నారు. అయితే ఇప్పుడు హఠాత్తుగా ఈ నిర్ణయంలో టీటీడీ నిర్ణయం మార్చుకుంది. వేసవి సెలవుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, రాజకీయ నేతల్నించి వస్తున్న విజ్ఞప్తుల మేరకు టీటీడీ సిఫారసు లేఖల్ని తిరిగి ప్రారంభించదల్చింది. జూలై 15 వరకూ రద్దు చేసిన సిఫారసు లేఖల్ని తిరిగి పునరుద్ధరిస్తోంది. మే 15 నుంచి (గురువారం) ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖల్ని స్వీకరిస్తామని మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి తెలిపారు.

## జగన్‌కు బిగ్ షాక్.. చంద్రబాబు సర్కార్ ఆదేశాలు



**అమరావతి, (రాజధాని వార్తలు):** మాచర్ల మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్‌కు కూటమి ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ పదవి నుంచి తురకా కిషోర్‌ను తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ మున్సిపల్ యాక్ట్‌లోని సెక్షన్ 16(1)(కె)ను ఉల్లంఘించినందుకు అతడిని ఈ పదవి నుంచి తొలగించినట్లు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. గత 15 మున్సిపల్ కౌన్సిల్ మీటింగులకు ఆయన హాజరు కాలేదని తేలడంతో ఈ పదవి నుంచి అతడిని తొలగించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతం తురకా కిషోర్ పోలీసుల అదుపులో ఉన్నట్టు జారీ చేసిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. మరోవైపు ఛైర్మన్ అధికారాలను దుర్వినియోగం చేసిన కేసులో చర్యలు ఎందుకు తీసుకోకూడదంటూ ఇప్పటికే తురకా కిషోర్‌కు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులపై అతడి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో తురకా కిషోర్‌ను మాచర్ల ఛైర్మన్ పదవి నుండి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2019 అసెంబ్లీ ఎన్నికల అనంతరం పల్నాడులోని మాచర్లలో టీడీపీ సీనియర్ నేతలు బోండా ఉమా, బుద్దా వెంకన్న పర్యటించారు. ఈ సందర్భంగా వారి పర్యటిస్తున్న కారుపై తురకా కిషోర్ దుడ్డు కర్రతో దాడి చేశాడు. ఈ కేసులోనూ అతడు నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. అలాగే వైసీపీ నేత, కడప మేయర్ కే సురేష్ బాబుపై పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆ పదవి నుంచి ఆయన్ని తొలగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపల్ చట్టాన్ని ఉల్లంఘించిన అంశంలో సురేష్ బాబుపై అనర్హత వేటు వేసినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. కుటుంబ సభ్యులకు కాంట్రాక్టు పనులు అప్పగించిన అంశంలో మేయర్ సురేష్ బాబుపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మేయర్ సురేష్ బాబును మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేశ్ కుమార్ అమరావతిలో విచారించారు. అయితే తనకు రెండు వారాల గడువు కావాలని మేయర్ కోరారు. మేయర్ వివరణపై ప్రభుత్వం సంతృప్తి చెందలేదు. దీంతో ఆయన్ని సైతం కడప మేయర్ పదవి నుంచి తొలగిస్తూ.. ఉత్తర్వులను ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్.సురేష్ కుమార్ జారీ చేశారు.

## రాష్ట్రపతితో సీడీఎస్, త్రివిధ దళాధిపతుల భేటీ



**న్యూఢిల్లీ :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులు బుధవారం నాడు భేటీ అయ్యారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన వివరాలను రాష్ట్రపతికి వీరు వివరించారు. రాష్ట్రపతి భవన్‌లో ఆర్మీ ఉన్నతాధికారులు తనను కలిసిన ఫోటోను రాష్ట్రపతి ముర్ము షేర్ చేశారు. సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, నావల్ స్టాఫ్ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి తనను కలుసుకున్నారని ఈ పోస్ట్‌లో రాష్ట్రపతి తెలిపారు. ఆపరేషన్ సిందూర్ వివరాలను తెలియజేశారని చెప్పుకొచ్చారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా త్రివిధ దళాలు పోరాడిన తీరును రాష్ట్రపతి ఈ సందర్భంగా అభినందించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్, పీఓకేలోని తొమ్మిది చోట్ల ఉగ్రశిబిరాలపై భారత త్రివిధ దళాల బలగాలు విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో ఉగ్రశిబిరాలు నేలమట్టం కావడం తోపాటు 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. ఇందుకు బదులుగా భారత మిలటరీ, సివిలియన్ ఏరియాల్లో పాక్ దాడులకు దిగడంతో భారత్ సమర్ధవంతంగా వాటిని తిప్పికొట్టింది. 11 పాకిస్థాన్ ఎయిర్‌బేస్‌లపై కీలక దాడులు జరిపింది. దీంతో కాళ్లబేరానికొచ్చిన పాక్ కాల్పుల విరమణ ప్రతిపాదన చేయడంతో అందుకు భారత్ అంగీకరించింది. ఉగ్రవాదంపై ఆపరేషన్ సిందూర్ కొత్త నిర్వచనం ఇచ్చిందని, టెర్రరిజం మూలాలు ఎక్కడున్నా భీకరంగా దాడులు చేస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. పాక్ న్యూక్లియర్ బ్లాక్‌మెయిల్‌కు లొంగే ప్రసక్తే లేదని, ఉగ్రశిబిరాలను సమూలంగా నాశనం చేస్తామన్నారు. టెర్రరిజం, టెర్రరిజం వెనక ఉన్న ప్రధాన సూత్రధారులను వేర్వేరుగా చూడమన్నారు. భారత్‌ను, దేశ ప్రజలను పరిరక్షించేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంటూనే ఉంటామని ప్రధాని స్పష్టం చేశారు.

## సిఐపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ సీరియస్

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** హయత్ నగర్ సిఐ నాగరాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. కోహెడ సర్వే నెంబర్ 951,952లో వివాదాస్పద భూమిని పరిశీలించిన కమిషనర్ రంగనాథ్, వివాదాస్పద భూమిలో మారణాయుధాలను చూసి అవాక్కయ్యారు. స్థలం కొనుగోలుదారులకి, ఫాంహౌస్ యజమానికి మధ్య గత కొంతకాలంగా ఈ స్థలం విషయమై వివాదం నడుస్తోంది. ప్లాటు యజమానులపై మారణాయుధాలతో దాడి చేస్తే, హత్యాయత్నం కేసు పెట్టకపోవడంతో సిఐ నాగరాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు రంగనాథ్. మీరు కొనుగోలు చేసిన స్థలాన్ని ఎవరైనా కబ్జా చేస్తే ఆ బాధ ఎలా ఉంటుందో మీకు తెలుస్తుంది అని సిఐని ప్రశ్నించారు రంగనాథ్. ఇక్కడ జరుగుతున్న పరిణామాలతోనే హైడ్రా పోలీసు స్టేషన్ ఏర్పాటు చేసినట్టు బాధితులకు భరోసా ఇచ్చారు రంగనాథ్. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం కొహెడ గ్రామంలోని రాజాజీ నగర పేరిట వేసిన లే ఔట్ ను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దాదాపు 17 ఎకరాల విస్తీర్ణంలో 190 వరకు ప్లాట్లతో ఉన్న లేఅవుట్‌లోని పార్కులు, రహదారులు కలిపేసి సమ్మిరెడ్డిబాల్ రెడ్డి తప్పుడు ధ్రువపత్రాలతో తమ ప్లాట్లను కబ్జా చేశారంటూ అక్కడి ప్లాట్ యజమానులు గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసారు. ఆక్రమణలను, రహదారులకు అడ్డంగా నిర్మించిన కట్టడాలను హైడ్రా తొలగించింది. దీంతో ప్లాట్ యజమానులు ఊపిరి పీల్చుకున్నా రు.

# కోవూరును ఇండస్ట్రియల్ హబ్‌గా మారుస్తాను

## - నిరుద్యోగ రహిత ఆంధ్రప్రదేశ్ సాధనకై చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబు కృషి - ఉద్యోగ సాధనకై నిరంతర కృషి చేయండి, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోండి - దేశ భవిషత్తు యుత చేతుల్లోనే వుంది - యువత స్వయం ఉపాధి దిశగా కృషి చేయాలి : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి





**బుచ్చి /కోవూరు, (రాజధాని వార్తలు):** ఏపీ రాష్ట్రంలో నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ రూపొందించారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలోని సిద్దార్థ కళాశాలలో ఎపి స్కిల్ డెవలెప్మెంట్ కార్పొరేషన్ సంస్థ మంగళవారం నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. జాబ్ మేళాకు హాజరైన యువతకు దిశా నిర్దేశం చేస్తూ ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఉద్వేగంగా ప్రసంగించారు. పిల్లలను ప్రయోజకులుగా చూడాలన్న తల్లితండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని ఆమె యువతకు హితోపదేశం చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకై ప్రభుత్వమే స్కిల్ డెవలెప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. నచ్చిన ఉద్యోగ వేటలో సమయం వృధా చేయకుండా అందుబాటులో వున్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. అవసరమైతే సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ దిశగా ప్రయత్నం చేయాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సూచించారు. పరిశ్రమల స్థాపన ద్వారా నెల్లూరు జిల్లా యువతకు ఉపాధి కల్పించే దిశగా ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కృషి చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో కోవూరు నియోజకవర్గాన్ని ఇండ్రస్టియల్ హబ్‌గా మారుస్తానన్నారు. నిరాశ నిస్పృహలు దరి చేరనీయకుండా సాధిస్తామని ధృడ సంకల్పంతో అడుగు ముందుకేయాలని తన మేటివేషనల్ ప్రసంగంతో యువతీ యువకులలో ఉత్సాహం నింపారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2 మెగా జాబ్ మేళాలు నిర్వహించి 2 వేలకు పైగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. ప్రతి ఒక్కరు ఎసి రూములు 4 డిజిట్ సాలరీ ఆశిస్తూ వచ్చిన చిన్న చిన్న అవకాశాలను వదిలేస్తున్నారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తన విజయం కోసం నిస్వార్ధంగా పని చేసిన యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. బుచ్చిరెడ్డి పాళెం జాబ్ మేళాకు హాజరైన యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జాబ్ మేళా నిర్వహిస్తున్న ఎపి స్కిల్ డెవలెప్మెంట్ కార్పొరేషన్ అధికారులను కోరారు. కూటమి ప్రభు త్వంలో మహిళలకు కుట్టు మిషన్లు ఇచ్చి స్వయం ఉపాధికి కృషి చేస్తున్న విషయాన్ని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు.

ఈ కార్యక్రమంలో స్కిల్ దేవలెప్మెంట్ అధికారి ఖయ్యూం ఖాన్, సెట్నల్ అధికారి నాగేశ్వరరావు, జిల్లా ఎంప్లాయి మెంట్ అధికారి వినయ్ కుమార్, బుచ్చి మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, మున్సిపల్ కమీషనర్ బాలకృష్ణ, తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీహరి టిడిపి నాయకులు బత్తల హరికృష్ణ, ఎంవి శేషయ్య, కోడూరు కమలాకర్ రెడ్డిఉసురు పాటి ప్రసాద్, కళ్యాణ్, రాష్ట్ర టీడీపీ నేత జి వి ఎన్ శేఖర్ రెడ్డి, వంశీ కృష్ణ రెడ్డి, టంగుటూరి మల్లారెడ్డి, వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ స్వామివారి శ్రీ పుష్ప యోగ మహోత్సవం








**అన్నవరం, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వెం కట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి రోజు అయిన మంగళవారం రాత్రి 8 గంటలకు శ్రీ స్వామివారిని అమ్మవారిని పల్లకిలో, కల్యాణ మండపంలో సర్వాంగ సుందరంగా తయారు చేసిన సుగంధ పరిమళించే పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన స్టేజి పై వధూవరులు శ్రీ సత్యనారాయణ స్వామివారు అనంతలక్ష్మి అమ్మవార్లను అర్చకులు, వేద పండితులు, వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ ఆశీనులు గావింప చేశారు. తదుపరి, శాస్త్రోక్తంగా, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహావచనం పూజలు నిర్వహించారు. జాజీ, సన్నజాజి, గులాబీ, సంపంగి, చామంతి, మెగలి రేకులతో స్వామివారిని అమ్మవారిని పుష్పాభిషేకం నిర్వహించారు. వివిధ ఫలములతో, విద్యుత్ అలంకరణలతో, మండపం సర్వాగ సుందరంగా తీర్చిదిద్దారు. అలంకరించిన ఊయలలో శేష పాన్పు పై పడుకొని ఉన్న విష్ణువులా, సత్యనారాయణ స్వామి, ఆయన పాదాల వద్ద లక్ష్మిదేవిలా సత్యవతి దేవి స్వామి పాదాలు ఒత్తుతున్నట్టు మెరిసిపోయారు. వచ్చిన ముత్తయిదువులకు రవిక, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమం చూడడానికి భక్తులు గ్రామస్తులు తండోపతండాలుగా తరలి వచ్చి విజయవంతం చేసారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు, ఏఈవో కొండల రావు, పీఆర్వో దామెర్ల కృష్ణారావు, సూపరింటెండెంట్లు, ఏసీ సీహెచ్ రామ్మోహన్, ఇంజనీరింగ్ అధికారులు ఈఈ రామక్రిష్ణ, ఈఈ శ్రీమతి నూకరత్నం, డిఈఈ గుర్రాజు, ఏఈ చౌదరి, విద్యుత్ డిఈఈ విశ్వనాదుల సత్యనారాయణ, ఏఈ ప్రసాద్, గణపతి, లక్ష్మీనారాయణ, సిబ్బంది, పాల్గొన్నారు.

# మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిద్ధమవుతున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

## - ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం



**కాకినాడ, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు మే 20 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. బుధవారం సాయంత్రం కాకినాడ సుందరయ్య భవన్‌లో సిఐటియు ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అర్బన్ పి.హెచ్.సి. ఉద్యోగుల నాయ కుడు జివివి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వ శేషబాబ్జీ ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఏళ్ళ తరబడి ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఏనాటికైనా రెగ్యులర్ చేస్తారని ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈలోపు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అయినా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ల వల్ల కార్మిక సంఘాలకే ప్రాధాన్యత లేకుండా పోతుందన్నారు. కార్మికులను కట్టుబానిసలుగా మార్చే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర కార్మిక సంఘాలు, స్వంతంత్ర ఫెడరేషన్ లు మే 20 న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె కు పిలుపు ఇచ్చాయన్నారు. కాకినాడ నగరంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు కూడా సమ్మెలో పాల్గొని, సమ్మె రోజు ప్రదర్శన, సభలను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో వివిధ యూనియన్ల నాయకులు బి. శ్యామ్, ఎం.నాగేశ్వరరావు, మందపల్లి సూర్యప్రకాష్, కొల్లి శ్రీనివాస్, ఆర్.లక్ష్మీనారాయణ, ఎం.వి.ప్రభాకరరావు, అనపర్తి ఏడుకొండలతో పాటు సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకట రమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ పొలిట్ బ్యూరో కీలక నిర్ణయాలు

**(రాజధాని వార్తలు):** ఆపరేషన్ సిందూర్ టీమ్‌కు పొలిట్ బ్యూరో అభినందన. పద్మభూషణ్ గ్రహీత బాలకృష్ణను అభినందించిన పొలిట్ బ్యూరో. 6, 17, 18 తేదీల్లో నియోజకవర్గాల్లో తిరంగా ర్యాలీలు. మహానాడులోగా అన్ని జిల్లా కమిటీలు పూర్తి చేయాలి.

- జూన్ 12 నుంచి కొత్తగా లక్ష వితంతు పెన్షన్లు. మూడు గ్యాస్ సిలిండర్లకు ముందే డబ్బు. గ్యాస్ తీసుకోవాలా వద్దా అనేది లబ్ధిదారుడి ఇష్టం.

కేంద్రం ఇన్‌స్టాల్‌మెంట్‌తో కలిపి అన్నదాత సుఖీభవ. త్వరలో సంక్షేమ పథకాల క్యాలెండర్. మూడు టర్మ్‌లు అనగా 6 సంవత్సరాలు మండలాధ్యక్షులుగా ఉన్నవారిని అదే పదవిలో కొనసాగించకూడదని పొలిట్‌బ్యూరో నిర్ణయం. అర్హత బట్టి ప్రమోషన్ లేదా వేరే కమిటీలోకి తీసుకోవాలని నిర్ణయం.

# కట్టిన మూడేళ్లలో కుప్పకూలిన ప్రాజెక్టు భూ ప్రపంచంలో కాళేశ్వరం మాత్రమే : సీఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** కట్టిన మూడేళ్లలో కుప్పకూలిన ప్రాజెక్టు భూ ప్రపంచంలో కాళేశ్వరం మాత్రమేనని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. నీళ్ల అవసరమే తెలంగాణను సాధించిందన్న రేవంత్.. గతంలో తెలంగాణ ఉద్యమాన్ని భావోద్వేగంగా మార్చి రాజకీయ ప్రయోజనం పొందారన్నారు. అనేక విషయాలపై ముక్కుసూటిగా మాట్లాడిన రేవంత్ రెడ్డి అనేక విషయాలపై సమగ్రంగా వివరించారు. విపక్ష బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు సెటైర్లు వేస్తూ ముప్పేటదాడి చేశారు. అటు ఉద్యోగుల గురించి కూడా సీఎం రేవంత్ కుండబద్ధలు కొట్టారు. "ఎవరు చేయాల్సిన పని వారు చేయాలి. నాయకులు చెప్పారని చేస్తే అధికారులు ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుంది. అప్పటి సీఎం హెలికాప్టర్లో వెళుతూ ఎక్కడ ప్రాజెక్టు కట్టాలో చెప్పారట. విజిలెన్స్ ఎన్‌డిఎస్‌ఏ నివేదికల్లో అధికారులను ఉరి తీయాలని చెప్పారు." "ప్రాజెక్టు ఎలా కట్టకూడదో కాళేశ్వరంను చూసి తెల్సుకోవాలి. ఎలా నిర్మించాలో నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను చూసి నేర్చుకోవాలి. కొందరు కోర్టులో కేసులు వేసి ఉద్యోగ నియామకాలు అడ్డుకుంటున్నారు. గ్రూప్ వన్ పరీక్షలకు ఏర్పాట్లు అన్ని పూర్తి అయ్యాయి. కానీ కొందరు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారు. నీళ్లు మన నాగరికత.. నీళ్ల కోసమే తెలంగాణ ఉద్యమం పుట్టింది. నీళ్ల కోసం మొదలైన మన ఆకాంక్షనే రాష్ట్రాన్ని సాధించి పెట్టింది. ఇది ఉద్యోగం కాదు.. ఒక భావోద్వేగం.. ఆ భావోద్వేగానికి మీరే ప్రతినిధులు. భావోద్వేగంతో కొన్ని పార్టీలు రాజకీయ లబ్ది పొందాయి." అని సీఎం రేవంత్ అన్నారు. "రెండు లక్షల కోట్లు ఖర్చుపెట్టినా తెలంగాణలో ఉమ్మడి రాష్ట్రంలో మొదలు పెట్టిన ప్రాజెక్టులు పూర్తి కాలేదు. గతంలో కట్టిన సాగునీటి ప్రాజెక్టులు ఎన్ని ఉపద్రవాలు వచ్చినా ఇప్పటికీ చెక్కు చెదరలేదు. కానీ కాళేశ్వరం మూడేళ్ళలోనే కట్టడం, కూలడం రెండూ జరిగిపోయాయి. ఎలా కట్టకూడదో, ఎలా కడితే ప్రజలకు నష్టం జరుగుతుందో అనే దానికి ఉదాహరణ కాళేశ్వరం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు కట్టిన చోట కనీసం సాయిల్ టెస్ట్ చేయలేదు. 80 వేల పుస్తకాలు చదివిన వ్యక్తి ఇంజనీరుగా మారి కట్టిన కాళేశ్వరం పరిస్థితి ఇది. త్వరలోనే గ్రూప్స్ ఉద్యోగాల నియామకాలు పూర్తి చేస్తాం" అని సీఎం రేవంత్ అన్నారు. జలసౌధలో కొలువుల పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు. హాజరయ్యారు. నీటిపారుదల శాఖలో కొత్తగా నియమితులైన ఏఈ, జెటిఓలకు సీఎంఈ సందర్భంగా నియామక పత్రాలు అందజేశారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కాబోతున్న మీ అందరికీ అభినందనలు. అని సీఎం కొత్త ఉద్యోగులను సాదరంగా ఆహ్వానించారు.

# వీరయ్య చౌదరి హత్య కేసు ఛేదించిన పోలీసులు.. పలువురి అరెస్ట్



**ఒంగోలు, (రాజధాని వార్తలు):** టీడీపీ నేత వీరయ్య చౌదరి దారుణ హత్య కేసును ప్రకాశం జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ హత్య కేసులో 11 మంది నిందితులను గుర్తించామని జిల్లా ఎస్పీ దామోదర్ వెల్లడించారు. బుధవారం విలేకర్ల సమావేశంలో ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ.. 9 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని చెప్పారు. మృతుడు వీరయ్య స్వగ్రామం అమ్మనబ్రోలుకి చెందిన ఆళ్ళ సాంబయ్య ఈ హత్య కేసులో ప్రధాన కుట్రదారుడిగా తమ దర్యాప్తులో గుర్తించామన్నారు. ఈ నిందితుల్లో ముప్పా సురేష్, దేవేంద్రనాథ్ చౌదరిలు వీరయ్య స్వగ్రామానికి చెందిన వారని తెలిపారు. ఇసుక వ్యాపారి వినోద్ అనే వ్యక్తితో పాటు నెల్లూరుకి చెందిన నలుగురు కిరాయి ముఠాతో వీరయ్య హత్యకు పథక రచన చేసి అమలు చేశారన్నారు. రాజకీయ, వ్యాపారాల్లో విభేదాలు నేపథ్యంలో వీరయ్య చౌదరిని కిరాయి హంతకులతో హత్య చేయించారని పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీ సాయంత్రం ఒంగోలులోని వీరయ్య చౌదరిని ఆయన కార్యాలయంలో దుండగులు విచక్షణా రహితంగా కత్తులతో పొడిచి హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో వీరయ్య మృతదేహంపై 50 కత్తి పోట్లు ఉన్నట్లు గుర్తించారు. ఏప్రిల్ 22వ తేదీ సాయంత్రం.. నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు చెందిన వీరయ్య చౌదరి.. ఒంగోలులోని ఆయన కార్యాలయంలో దారుణ హత్యకు గురయ్యారు. నలుగురు నిందితుల్లో ఇద్దరు కత్తులతో ఆయన్ను 53 సార్లు విచక్షణారహితంగా పొడిచి హతమార్చారు. ఆపై స్కూటీ, ద్విచక్ర వాహనంపై వారు పరారయ్యారు. అధికార పార్టీ నేత దారుణ హత్యకు గురి కావడంతో.. జిల్లా పోలీసులు ఈ కేసు దర్యాప్తును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. అందులోభాగంగా 55 మంది అనుమానితులను పోలీసులు విచారించారు. అలాగే మొత్తం 50 బృందాలతో పోలీసులు ఈ దర్యాప్తు చేపట్టారు. ఆ క్రమంలో తొలుత అమ్మనబ్రోలు, నాగులుప్పలపాడుకు చెందిన ఇద్దరు ప్రధాన అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఇక ఏప్రిల్ 25వ తేదీ చీమకుర్తిలో నిందితులు వదిలి వెళ్లిన రక్తపు మరకలున్న స్కూటీని, ఆ మరుసటి రోజు ఒంగోలులోని మంగమూరు రోడ్డులో మరో ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు మొత్తం 55 మంది అనుమానితులను విచారించి అనంతరం నిందితుల విషయంలో పోలీసులు ఓ అంచనాకు వచ్చారు. వీటి ఆధారంగా వీరయ్య చౌదరి హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేశారు.

# భారీ లాభాల్లో కమల్ – మణిరత్నం 'థగ్ లైఫ్'!



ఇండియన్ సినీ చరిత్రలో కమల్ హాసన్, మణిరత్నంలకు ప్రత్యేక స్థానం ఉంది. వీరిద్దరి కలయికలో రూపొందిన సంచలన చిత్రం 'నాయకుడు'. తమిళంతో పాటు తెలుగులోనూ ఈ సినిమా సంచలన విజయాన్ని సాధించి వీరిద్దరి కెరీర్‌లో మరపురాని సినిమాగా నిలిచింది. 1987లో 'నాయకన్' పేరుతో విడుదలైన ఈ సినిమా అప్పట్లో సంచలనం సృష్టించింది. హేమా హేమీలు పని చేసిన ఈ సినిమాతో కమల్ నటుడిగా సరికొత్త చరిత్రను సృష్టించారు. అప్పట్లో కోటి వసూలు చేసిన ఈ సినిమా తరువాత మరోసారి కమల్ – మణిరత్నం కలిసి పని చేయలేదు. సుధీర్ఘ విరామం తరువాత మళ్లీ వీరిద్దరు లెజెండ్‌లు కలిసి చేస్తున్న సినిమా 'థగ్ లైఫ్'. గ్యాంగ్ స్టర్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ మూవీలోని కీలక పాత్రల్లో శింబు, త్రిష, అభిరామి, బాలీవుడ్ నటి సాన్యా మల్హోత్రా, ఐశ్వర్య లక్ష్మీ, పంకజ్ త్రిపాఠీ, మహేష్ మంజ్రేకర్ నటిస్తున్నారు. షూటింగ్ పూర్తయింది. జూన్ 5న పాన్ ఇండియా మూవీగా భారీ స్థాయిలో రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని ఇటీవల ప్లాన్ చేశారు. అయితే భారత్ –పాక్ యుద్ధం మొదలు కావడంతో ఆ ఈవెంట్‌ని వాయిదా వేశారు. త్వరలోనే ప్రమోషన్స్‌ని టీమ్ ప్రారంభించబోతోంది. కమల్, మణిరత్నంలతో కలిసి ఈ మూవీని యంగ్ హీరో ఉదయనిధి స్టాలిన్ నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా నాన్ థియేట్రికల్ రైట్స్‌కు సంబంధించిన ఇంట్రెస్టింగ్ న్యూస్ ఒకటి బయటికి వచ్చి వైరల్ అవుతోంది. ఈ మూవీ ఓటీటీ హక్కుల్ని ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ రూ.149.7 కోట్లకు దక్కించుకుందని తెలిసింది. ఇటీవలే ఈ డీల్‌ని మేకర్స్ పూర్తి చేశారని ఇన్ సైడ్ టాక్. అంతేకాకుండా ఈ మూవీ శాటిలైట్ హక్కుల్ని విజయ్ టీవి రికార్డు ప్రైజ్‌కు దక్కించుకుందట. ఏకంగా ఈ మూవీ శాటిలైట్ హక్కులకు విజయ్ టీవి రూ.60 కోట్లు చెల్లించిందని, ఈ మధ్య కాలంలో కమల్ సినిమాకు దక్కిన భారీ ఆఫర్ ఇదని కోలీవుడ్ వర్గాలు అంటున్నాయి. అంటే ఓటీటీ హక్కులు, శాటిలైట్ హక్కుల రూపంలో ఈ సినిమాకు రూ.210 కోట్ల వరకు వచ్చినట్టే. అంటే టీమ్ రిలీజ్‌కు ముందే లాభాల్లోకి వెళ్లినట్టుగా తెలుస్తోంది. ఇక థియేట్రికల్ హక్కుల రూపంలో కమల్, మణిరత్నంకు భారీ లాభాలు రావడం ఖాయంగా కనిపిస్తోంది.

# బాలీవుడ్‌లో కళావతికి మరో బంపర్ ఆఫర్!



కీర్తి సురేష్ అలియాస్ కళావతి 'బేబీజాన్'తో బాలీవుడ్‌లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. ఇందులో వరుణ్ ధావన్ కి జోడీగా నటించింది. భారీ యాక్షన్ థ్రిల్లర్ గా రిలీజ్ అయిన చిత్రం మాత్రం ఆశించిన ఫలితాలు సాధించలేదు. దీంతో కళావతికి ఆరంభంలో చేదు అనుభవం తప్పలేదు. అయినా కీర్తికి కొత్త ఛాన్సులకేమి కొదవలేదన్నట్లు బ్యాక్ టూ బ్యాక్ ఛాన్సులందుకుంటుందనే ప్రచారం బాలీవుడ్ మీడియాలో పీక్స్‌లో జరుగుతోంది. ఇప్పటికే కొన్ని ప్రాజెక్ట్‌లకు సంబంధించి అగ్రిమెంట్ జరిగినట్లు వార్తలొస్తున్నాయి. ఆ సినిమాలేంటి? అన్నది బయటకు రాలేదు కానీ తాజాగా రాజ్ కుమార్ రావుకి జోడీగా మరో చిత్రంలో ఎంపికైనట్లు తెలుస్తోంది. విద్యా వ్యవస్థ నేపత్యంలో రాజ్ కుమార్ రావు హీరోగా ఓ సినిమాకు సన్నాహాలు జరుగు తున్నాయి. ఈ చిత్రాన్ని ఆయనే సొంత బ్యానర్లో నిర్మిస్తున్నారు. 'సెక్టార్ 36' ఫేం ఆదిత్యా నింబాల్కర్ తెరకెక్కిస్తున్నారు. ఇందులో హీరోయిన్‌గా కీర్తి సురేష్ ఎంపికైంది. విద్యావ్యవస్థలో కుంభకోణాన్ని బయట పెట్టే పాత్రలో కీర్తి కనిపించనుంది. జూన్‌లోనే చిత్రీకరణకు రంగం సిద్దమవుతోంది. ఇదే నెలలో కీర్తి సీక్రెట్‌గా ఉంచిన మరో ప్రాజెక్ట్ కూడా లాంచ్ అవుతుందని సమాచారం. మొత్తానికి అమ్మడికి తొలి సినిమాతో వైఫల్యం ఎదురైనా అవకాశాల పరంగా జోరందుకుంటుంది.

ఇదే తరహాలో శ్రీలీల కూడా వరుస ఛాన్సులందుకుంటుంది. తొలి సినిమా రిలీజ్ కు ముందే రెండు..మూడు ప్రాజెక్ట్‌లు రెడీగా చేతిలో పెట్టుకుంది. బాలీవుడ్ మేకర్స్ కూడా ఈ మధ్య కాలంలో సౌత్ భామలకు పెద్ద పీట వేస్తున్నారు. ట్యాలెంటెడ్ బ్యూటీలకు అవకాశాలు కల్పించడానికి ముందుకొస్తున్నారు. మునుపటి పరిస్థితికి పూర్తి భిన్నమైన సన్నివేశం బాలీవుడ్ మార్కెట్‌లో కనిపిస్తోందిప్పుడు.

# స్టార్ హీరోయిన్ సినిమాలకు బ్రేక్..!



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కియరా అద్వాని బిఫోర్ మ్యారేజ్ వరకు సూపర్ ఫాంలో ఉంది. 2023 ఫిబ్రవరిలో సిద్దార్థ్‌తో పెళ్లి తర్వాత కెరీర్‌లో దూకుడు తగ్గించింది కియరా. పెళ్లైతే అవకాశాలు తగ్గుతాయి అన్నది ఇదివరకు మాట ఇప్పుడు పెళ్లైనా పిల్లలు ఉన్నా సరే టాలెంట్‌కి ఏది అడ్డు రావట్లేదు. ఇప్పటికే బాలీవుడ్‌లో చాలామంది హీరోయిన్స్ పెళ్లై పిల్లలు ఉన్నా కూడా సినిమాల్లో రాణిస్తున్నారు. అలియా భట్, దీపిక దీనికి ప్రధాన ఉదాహరణగా చెప్పొచ్చు. ఐతే కియరా జస్ట్ పెళ్లి మాత్రమే చేసుకుంది ఇంకా పిల్లల విషయంలో నిర్ణయాలు తీసుకోలేదని అనుకున్నారు. కానీ ఇప్పుడు అది కూడా అయ్యింది. ప్రస్తుతం కియరా ప్రెగ్నన్సీగా ఉంది. సో ఈ టైంలో సినిమాలు చేయడం కష్టం. ప్రస్తుతం ఆమె ఎన్ టీ ఆర్, హృతిక్ రోషన్ చేస్తున్న వార్ 2 లో నటిస్తుంది. ఆ సినిమా ఆగష్టు 14న రిలీజ్ అనుకున్నారు. మరి అనుకున్న టైం కు రిలీజ్ అవుతుందా అన్నది చెప్పడం కష్టం. కియరా పోర్షన్ పూర్తై ఉంటే రిలీజ్ చేసే ఛాన్స్ ఉంది కానీ కియరాకి సంబంధించిన సీన్స్ పెండింగ్ ఉంటే మాత్రం సినిమా ఆ టైంకి పూర్తి చేయడం కష్టం. ఈమధ్యనే కియరా ఒక ఈవెంట్‌కి బేబీ బంప్‌తో వచ్చింది. సో కియరా డెలివరీ అయ్యాక ఎలా లేదన్నా ఒక ఆరు నెలలు రెస్ట్ తీసుకునే ఛాన్స్ ఉంటుంది.

ఇంకా టైం కావాలంటే ఒక ఏడాది టైం తీసుకున్నా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. కియరా ఈ ఏడాది పాటు సినిమాలు చేసే ఛాన్స్ లేదు. వార్ 2 తో పాటు అమ్మడు కె.జి.ఎఫ్ టాక్సిక్‌లో కూడా నటిస్తుంది. సో కియరా బ్రేక్ తీసుకుంటే కచ్చితంగా ఆ సినిమా మీద ఎఫెక్ట్ పడుతుంది. టాక్సిక్ సినిమాను 2026 సమ్మర్ రిలీజ్ ప్లాన్ చేశారు. మరి కియరా ఈలోగా ఆ షూటింగ్‌కి సహకరిస్తుందా లేదా అన్నది చూడాలి. బాలీవుడ్‌లో కూడా వార్ 2 తప్ప కియరా వేరే ప్రాజెక్ట్ కి సైన్ చేయలేదు. ఐతే అసలే అవకాశాలు లేని ఈ టైంలో కియరా ఈ బ్రేక్ తీసుకోవడం తప్పనిసరి అయినా ఆమె కెరీర్ మీద కచ్చితంగా ఇంపాక్ట్ పడేలా చేస్తుందని అనిపిస్తుంది. మరి కియరా మళ్లీ బ్రేక్ తర్వాత కంబ్యాక్ ఇస్తుందా లేదా అన్నది చూడాలి.

# 'తమ్ముడు' రిలీజ్ డేట్ మారింది!



వరుస ఫ్లాప్‌లతో సతమతమవుతున్న హీరో నితిన్. భీష్మ తరువాత ఆ స్థాయి సక్స్‌ని సొంతం చేసుకోలేకపోతున్నాడు. కొత్త కథలని నమ్మి చేసిన సినిమాలన్నీ వరుసగా ఫ్లాప్ అవుతుండటంతో జాగ్రత్త పడుతున్న నితిన్ ఈ సారి ఎలాగైనా హిట్‌ని దక్కించుకుని బలంగా కమ్ బ్యాక్ కావాలని పట్టుదలతో ఉన్నాడు. ఇందులో భాగంగా దిల్ రాజు నిర్మిస్తున్న 'తమ్ముడు'పై భారీ ఆశలే పెట్టుకున్నాడు. 'వకీల్ సాబ్' తరువాత స్టార్ హీరోల వెంట పరుగెత్తి ఏ హీరో కుదరకపోవడంతో నితిన్‌ని పట్టుకున్నాడు వేణు శ్రీరామ్. తను రూపొందిస్తున్న లేటెస్ట్ మూవీ 'తమ్ముడు'. పవన్ కల్యాణ్ హిట్ టైటిల్ కావడం, పవన్‌కు నితిన్ వీరాభిమాని కావడంతో ఈ మూవీపై పవన్ అభిమానులతో పాటు నితిన్ ఫ్యాన్స్ భారీ అంచనాలు పెట్టుకున్నారు. నితిన్ కూడా ఈ సినిమాతో భారీ విజయాన్ని దక్కించుకోవాలని చూస్తున్నాడు. 'కాంతార' ఫేమ్ సప్తమిగౌడ హీరోయిన్‌గా నటిస్తుండగా ఈ మూవీతో హీరోయిన్ లయ రీ ఎంట్రీ ఇస్తోంది. తను ఈ మూవీలో పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ క్యారెక్టర్‌లో నటిస్తోంది. దిల్ రాజు, శిరీష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గతంలో నితిన్‌కు 'శ్రీనివాస కల్యాణం'తో ఫ్లాప్‌ని అందించిన దిల్‌రాజు ఈ మూవీతో హిట్‌ని అందించాలనే పట్టుదలతో ఉన్నారట. అందుకే శ్రీరామ్ వేణుతో పక్కా కమర్షియల్ ఫ్యామిలీ యాక్షన్ డ్రామా కథని రెడీ చేయించి ఈ మూవీ చేశారని ఇన్ సైడ్ టాక్. ఇదిలా ఉంటే ఈ సినిమా రిలీజ్ కొంత కాలంగా వాయిదా పడుతూ వస్తోంది.

యూనిట్ కూడా సినిమా రిలీజ్ ఎప్పుడు అని రీల్స్ చేశారంటే ఈ మూవీ రిలీజ్ కోసం టీమ్ ఎంతగా ఎదురు చూస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఫైనల్లీ ఈ మూవీ రిలీజ్ డేట్ కన్ఫర్మ్ అయింది. ముందు డైరెక్టర్ శ్రీరామ్‌వేణు పుట్టిన రోజు సందర్భంగా ఓ వీడియోని విడుదల చేసి అందులో రిలీజ్ డేట్‌ని ప్రకటించడం తెలిపసిందే. జూలై 4న వస్తున్నాం అంటూ ప్రకటించారు. అయితే తాజాగా ఆ డేట్ మారినట్టుగా తెలుస్తోంది. తాజాగా ఈ మూవీని జూలై 24న రిలీజ్ చేయాలని దిల్ రాజు నిర్ణయించారట. ఈ డేట్‌ని టీమ్ అఫీషియల్‌గా త్వరలో ప్రకటించబోతోంది.

# ఉగ్రదాడులు, విపత్తులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

## - డి.ఆర్.ఓ. వై.సత్యనారాయణ రావు - గ్రీన్ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్‌లో ప్రభుత్వ శాఖల మాక్ డ్రిల్












**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఉగ్రదాడులు, విపత్తులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్య న్నారాయణరావు జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం ఉ దయం అనకాపల్లి పట్టణం బైపాస్ రోడ్డులోని జయభేరి మారుతి షోరూం ఎదురుగా ఉన్న గ్రీన్ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్ లో శేషాద్రి బ్లాక్ వద్ద జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యన్నారాయణ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ డ్రిల్ ఆసాంతం ఆశక్తి కరంగా సాగింది. ఈ సందర్భంగా పాత్రికేయులతో డి.ఆర్.ఓ. మాట్లాడుతూ గ్రీన్ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీలో శేషాద్రి బ్లాక్‌లో మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు. జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన (ఎస్ఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్) దళాలు మరియు రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్యారోగ్య శాఖలు, జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన (ఎస్ఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్) దళాలు విన్యాసాల్లో భాగస్వామ్యం అయ్యుయ్యాన్నారు. అపార్ట్మెంట్లో సుమారుగా 400 నుంచి 500 దాకా జనాభా ఉంటారని ఇలాంటి అపార్ట్మెంట్‌లలో ఎక్కువగా మానవ నష్టాలు ఉండే అవకాశాలుంటా యని, అప్పుడు బాంబు పేలితే, ఆ భవనం కూలిపోతే ఏం చేయాలి, సైరన్ మోగినప్పటి నుంచి చివరికి వారు రెస్క్యూ చేసి హాస్పిటల్ కి చేర్చేదాకా వివిధ రకాల డ్రిల్స్‌ని మొదట అధికారులు చూపించడం జరిగిందన్నారు. వినూత్నమైన పరికరాల గురించి వివరించడం జరిగిందని పేర్కొన్నారు. విపత్తుల యాజమాన్య సంస్థ సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులను నిర్వహిస్తారని అన్నారు. అన్ని శాఖాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజల ప్రాణాలతో పాటు ఆస్తినష్టం జరగకుండా చూడాలని అన్నారు. అధికారులు కూడా డ్రిల్ గురించి నేర్చుకున్నారన్నారు. తరువాత ఇక్కడున్న పౌరులచేత రెస్క్యూ చేయించడం జరిగిందని తెలిపారు. మాక్ డ్రిల్ పట్ల పిల్లలు, మహిళలకు, యువకులకి ఎక్కువగా అవగాహన రావాల న్నారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో సీజ్ ఫైర్ ఉన్నా సరే ప్రజలందరూ కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం యంత్రాంగం వచ్చినప్పుడు వారికి ఎలా సహకరించాలి అనేది తెలుసుకోవాలన్నారు. అంతకు ముందు అకస్మాత్తుగా ఏదైనా విపత్తు సంభవిస్తే, విపత్కర, సంక్షోభ పరిస్థితులు ఎదురైతే, యుద్ధం వల్ల బాంబులు పడి లేదా గ్యాస్ లీక్, షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదాలు చోటు చేసు కుంటే, అలాంటి సమయంలో ప్రభుత్వం ఏవిధమైన సహాయ చర్యలు తీసుకుంటుంది, వివిధ ప్రభుత్వ శాఖలు ఎటువంటి చర్యలు చేపడతాయి. ఆయా శాఖల సిబ్బంది ప్రాణాలకు తెగించి ప్రజలను ఏవిధంగా కాపాడతారు అన్న అంశాలను కళ్లకు కట్టి నట్టు చేసి చూపించారు. బాంబులు, ఇతర ప్రేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే విధానాన్ని కూడా వివరించారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్యారోగ్య శాఖ, ఎస్‌డిఆర్ఎఫ్, ఎన్డిఆర్ఎఫ్, తదితర శాఖలు ఈ విన్యాసాల్లో భాగస్వాములు అయ్యాయి. పై అంతస్థులో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అక్కడికి అగ్నిమాపక సిబ్బంది చేరుకోవడం, క్షతగాత్రులను అక్కడినుంచి క్రిందకి దించడం, వారికి వైద్య సహాయాన్ని అందించడం, హుటాహుటిన అంబు లెన్సు ద్వారా ఆసుపత్రికి తరలించడం, అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ సిబ్బందికి ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది సహాయ పడటం, అప్పటికీ పరిస్థితి అదుపులోనికి రాని పక్షంలో ఎన్డిఆర్ఎఫ్ దళాలు జత కలవడం, ప్రజల ప్రాణాలను రక్షించి, సహాయ చర్యలు చేపట్టడం తదితర అంశాలను ప్రత్యక్షంగా చేసి చూపించారు. ప్రకృతి వైపరీత్యాలతోపాటు, మానవ ప్రేరేపిత ప్రమాదాలను సైతం ఎదుర్కొనే విధానాన్ని వివరించి, అధికారులు తమ సన్న ద్ధతను తెలియజేశారు. మాక్ డ్రిల్ కార్యక్రమంలో అనకాపల్లి ఇంచార్జి ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శాంతి ప్రభ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్ వెంకటరమణ, ఎన్.డి.ఆర్.ఎఫ్. ఇన్స్పెక్టర్ సుశాంత్ కుమార్, అగ్ని మపక, రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఎన్. డి.ఆర్.ఎఫ్., ఎస్.డి.ఆర్.ఎఫ్ దళాలు, గ్రీన్ హిల్స్ గ్రేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్ పౌరులు, తదితరులు భాగస్వామ్యమయ్యారు.

# వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలి : ఇంచార్జి జిల్లా కలెక్టరు ఎమ్.జాహ్నవి






**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** జిల్లాలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని జాయింటు కలెక్టరు మరియు ఇంచార్జి జిల్లా కలెక్టరు ఎమ్. జాహ్నవి తెలిపారు. బుధవారం జాయింటు కలెక్టరు కార్యాల యంలో వేసవి క్రీడా శిబిరాల క్రీడాకారులకు క్రీడా పరికరాలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 50 వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. విద్యార్థులందరూ క్రీడా శిబిరాలను వినియోగించుకొని ఆటలలో బాగా రాణించాలని, భవిష్యత్తులో పతకాలు సాధించాలని తెలి పారు. ఆటల వలన విద్యార్థుల మనోవికాశం పెరుగుతుందని, ఆరోగ్యం బాగుంటుందని, చదువులో రాణిస్తారని కావున తల్లి దండ్రులు తమ పిల్లలను ఆటలలో పాల్గొనే విధంగా ప్రోత్స హించాలని తెలిపారు.

ప్రతి క్రీడా శిబిరానికి అయిదువేల రూపా యలు విలువ చేసే క్రీడా పరికరాలను పంపిణీచేయడం జరిగిం దని తెలిపారు. క్రీడా పరికరాల నాణ్యతగూర్చి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎల్.వి. రమణ క్రీడా శిక్షణా శిబిరాల వివరాలు తెలియజేస్తూ జిల్లాలో ఏర్పాటుచేసిన 50 శిక్షణా శిబిరాలకు 982 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని, వారిలో 612 మంది బాలురు, 370 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. వీరికి 20 క్రీడా అంశాలలో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. 8 నుండి 14 సంవ త్సరాల వయస్సు గల విద్యార్థులలో ప్రతిభావంతులను గుర్తించి వారిని ప్రోత్సహించడం కోసం ప్రతి సంవత్సరం క్రీడా శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడా పరికరాల పంపిణీ కార్యక్ర మంలో అచ్చుతాపురం, జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా శిబిరం, హరిపాలెం రగ్బీ ఆట శిబిరం, అక్కిరెడ్డిపాలెం క్రీడాశిబిరం విద్యా ర్థులు పాల్గొన్నారు. కో కో ఆటలో జాతీయ స్థాయిలో రజత పతక విజేత శ్యామ్ ప్రసాద్ ను ఇటీవల జరిగిన సివిల్ సర్వీసెస్ ఆటల పోటీలలో వెండి పతకం సాధించినందుకు ఇంచార్జి కలె క్టరు అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు కె.త్రిమూర్తులు, రెహమాన్, చిరంజీవి, రమేష్ పాల్గొన్నారు.

# మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్, మోస్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవంతంగా ముగిసిన కంప్యూటర్, టైలరింగ్, మగ్గం డిజనైర్ వర్క్ బ్యూటీషియన్, నైపుణ్య శిక్షణా తరగతులు

**- మహిళలకు, విద్యార్థులకు ధృవీకరణ పత్రాల పంపిణీ - ముఖ్య అతిధిగా పాల్గొన్న కాటంనేని వెంకటేశ్వరరావు : దాతలకు కృతజ్ఞతలు తెలిపిన కోయసుధ - మోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్‌లో స్టేట్ ఫస్ట్ సాధించిన భూక్య హరిణికి నీట్ కోచింగ్ నిమిత్తం రూ. 10000 చెక్ అందించిన మోస్ట్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు - ఇటీవల మరణించిన మోస్ట్ ప్రధాన కార్యదర్శి జవ్వాజి రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం తెలియజేసిన మోస్ట్, మదర్ థెరిసా ట్రస్ట్ సభ్యులు**




**మైలవరం, (రాజధాని వార్తలు):** మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో కోయసుధ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్ర మంలో గత కొన్ని రోజులుగా నైపుణ్య శిక్షణ పొందుతున్న విద్యా ర్దులకు మోస్ట్ గౌరవ అధ్యక్షులు కాటంనేని వెంకటేశ్వరరావు పాల్గొని మొదటిగా ఇటీవల మరణించిన మోస్ట్ ప్రధాన కార్యదర్శి చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపాన్ని తెలియజేసారు. మోస్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిన్నారి భూక్య హరిణికి 10000 రూ చెక్ అందించారు. విద్యార్థులందరికీ దృవీకరణ పత్రాలు అందిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ తరగులు మహిళల ఆర్థిక అభివృద్ధికి ఎంతో ఉపయోగంగా ఉన్నాయని, రామారావు ఈ రోజు మనమధ్య లేకపోవడం విచా రకరం అన్నారు. మోస్ట్ జాయింట్ సెక్రటరీ సూరిమంచి వసుకు మార్ మాట్లాడుతూ నేటి పోటీతత్వ సామాజంలో ఎంతో నైపుణ్యం, ఓర్పు యువతకు చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మోస్ట్ సూరిమంచి జాయింట్ సెక్రటరీ వసుకుమార్, మోస్ట్ మరియు మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శులు సగ్గుర్తి విజయలక్ష్మి, జూలకంటి ప్రసాద్ కోశాధికారులు అమీర్ హంజ, ద్రోణవల్లి విజయలక్ష్మి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చలవాది మధుసూదనరావు, మన్నే శ్రీనివాసరావు, దునకా ప్రసాద్, సూర్యనారాయణ, కోటేశ్వరరావు, వీరాచారి, సీతారామయ్య, మైక్ బాబురావు, కృష్ణ కుమారి, షహేద, వీరరాజు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# మసూద్ అజార్‌కు రూ. 14 కోట్లు చెల్లించనున్న పాక్



**న్యూఢిల్లీ :** పాలు తాగుతూ.. తనను ఎవరూ చూడలేదన్నట్లుగా పిల్లి వ్యవహరిస్తుందంటారు. అదే రీతిలో పాకిస్థాన్ తీరు ఉందనే ఒక చర్చ అయితే జరగుతోంది. ఉగ్రవాదానికి పాకిస్థాన్ ఊతం ఇస్తుందన్న సంగతి అందరికి తెలిసిందే. కానీ ఉగ్రవాదం గురించి తమకు ఏం తెలియదంటూ పాకిస్థాన్ ఇప్పటికే నక్క వినయాన్ని ప్రదర్శించింది. ప్రదర్శిస్తోంది కూడా. ఏప్రిల్ 22వ తేదీన జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడితో తమకు ఏం ప్రమేయం లేదంటూ ఆ దేశం వెల్లడించింది. ఆ కొద్ది రోజులకే పహల్గాం పాపం తమదేనంటూ పాకిస్థాన్‌లోని అత్యున్నత సైనికాధికారి ప్రకటించారు. దీంతో పహల్గాం దాడి వెనుక పాక్ హస్తం ఉం దని రుజువు అయింది. ఉగ్రవాదానికి పాక్ ఊతం ఇస్తుందనేం దుకు తాజాగా మరో విషయం వెలుగులోకి వచ్చింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా భారత్.. ఆపరేషన్ సిందూర్ పేరిట దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో జైషే మహమ్మద్ సంస్థ చీఫ్ మసూద్ అజార్ కుటుంబ సభ్యులతోపాటు అతడి సన్నిహితులు మొత్తం 14 మంది మరణించారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మృతులు ఒక్కొక్కరికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. దీంతో జైషే మహమ్మద్ సంస్థ చీఫ్ మసూద్ అజార్‌కు రూ. 14 కోట్లు ఎక్స్‌గ్రేషియాగా ప్రభుత్వం తరఫున అందనుంది. మే 7వ తేదీ తెల్లవారుజామున పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం దాడి చేసింది. ఈ దాడిలో దాదాపు 100 మందికిపైగా మరణించినట్లు భారత్ వెల్లడించింది. అయితే ఈ దాడిలో మసూద్ అజార్ సోదరుడు అబ్దుల్ రవుఫ్ అజార్‌తోపాటు ఇద్దరు బావలు మరణించారు. అయితే ఈ అబ్దుల్ రవుఫ్ అజార్.. మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్‌గా భారత్ గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. 1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం హైజాక్ పథక రచనలో ఇతడు కీలక సూత్రదారిగా ఉన్నాడు. అలాగే 2001లో పార్లమెంట్‌పై దాడితోపాటు పఠాన్‌కోట్ ఎయిర్ బేస్‌పై దాడి కేసులో సైతం అబ్దుల్ రవుఫ్ అజార్ కీలకంగా వ్యవహరించినట్లు భారత్ నిఘా వర్గాల వద్ద స్పష్టమైన ఆధారాలు న్నాయన్న సంగతి అందరికి తెలిసిందే.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan